ఓ సీతాపతికథ - బేహరా వెంకట సుబ్బారావు

సీతామహాలక్ష్మి భరించలేని శిరోవేదనతో బాధ పడ్తోందన్న వార్త తెల్లవారేసరికి ఆ వాడంతా వ్యాపించింది ఆ వార్త విన్న తరుణీమణులందరూ తల్లడిల్లిపోయారు వెంటనే వెళ్ళి ఆమెను చూడాలని, చూసి పలకరించాలనీ, పలకరించి తమ ఆవేదనను వ్యక్తం చేయాలనీ అనుకొన్నారు పనుల్లో మునిగి వున్న పడతులు తమ గృహకృత్యాలు చేసుకోలేక కాలు చేయీ ఆడక విలవిల్లాడిపోయారు

గవర్నమెంటు డాక్టరుగారి సతీమణి గౌరీదేవి తెల్లవారేసరికి భర్తను నిద్రలేపింది అర్థాంగి అభ్యర్థన విని ఆపై ఆమె పోరు పడలేక గ్రాడెజ్ అల్మరా తెరిచారు అత్యంత పవరుగల మాత్రలను తీసి యిచ్చారు టాబ్లెట్ లోనికి వెళ్ళి తలనొప్పిని బయటకు విసిరివేస్తుందని గ్యారంటీ ఇచ్చారు ఫారెస్టు రేంజరుగారి భార్య పార్వతి బంట్రోతు లబుడిగాణ్ణి పిల్చింది కావడితో నీళ్ళు తెస్తున్న వాణ్ణి ఆ పని ఆపమంది అర్జంటుగా అడవిలోకి వెళ్ళమంది పచ్చాది ఆకులు తెమ్మని ఆజ్ఞాపించింది ఆ ఆకు పసరు నాలుగు చెంచాలు తీసుకొంటే తలనొప్పి మరు క్షణంలో మాయమౌతుంది అయిదు నిముషాల్లో తేవాలని ఆజ్ఞాపించింది హైస్కూలు హెడ్మాష్టరు గారి భార్య అమృతాంజనం సీసాకోసం కాళ్ళు పడి పోయేలా వెతికి విసిగినా తన ప్రయత్నం మానలేదు చివరికి ఆఖరబ్బాయి బాబిగాడి బట్టల పెట్టెలోంచి బయటకు తీసి సీతామహాలక్ష్మి ఇంటికి వెళ్ళింది మొట్టమొదటి విజిటర్‌గా హెడ్మాష్టరుగారి సతీమణి హైమవతి

సీతామహాలక్ష్మి మినిష్టరుకాదు మినిష్టర్ గారి భార్య అంతకన్నాకాదు ఆఫీసరు అసలే కాదు మామూలు ప్రభుత్వోద్యోగి, ఒక ఎకౌంటెంట్ భార్య మాత్రమే శిరోవేదనతో బాధపడ్తోంది

* * *

విశాఖపట్నం జిల్లాలో అదొక ఏజన్సీ గ్రామం చుట్టుపక్కల వున్న పాతిక ముప్పై గ్రామాలకు అది కేంద్రం బస్సు మార్గంలో వుంది ఆ గిరిజన గ్రామం గిరిజనాభివృద్ధి కోసమూ, అటవీ సంపద పరిరక్షణకోసమూ, భూసార పరిరక్షణకొరకూ, మలేరియా నిర్మూలనకొరకూ ఇంకా అనేకానేక కార్యాలయాలను ఆ గ్రామంలో నెలకొల్పింది ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రి, వ్యవసాయ డిప్యూటీ డైరెక్టరుగారి ఆఫీసు, స్టేట్ బ్యాంక్, పోస్టాఫీసు మొదలైన ఆఫీసులున్నాయ్ అది తాలూకా కేంద్రం కూడా ఆ గ్రామాన్ని కాలనీ అని పిలుస్తారు కూడా చిన్నా పెద్దా మొత్తం రెండువందలమంది వరకూ ప్రభుత్వోద్యోగులుంటా రక్కడ

గిరిజన ప్రాంతంలో వున్నా ఆ కాలనీలోని జనాభాలో ఎక్కువ శాతం గిరిజనేతరులే ! ఉదయం ఎనిమిదిగంటలు అయితేగాని సూర్యోదయంకాదు సాయంత్రం అయిదుగంటలకల్లా చీకటి పడుతుంది అక్కడవారికి ఎంటర్‌టైన్‌మెంటులేదు ఓ సినిమా హాలు అయినా లేదు ముప్పై మైళ్ళు ప్రయాణం చేసి కొండ దిగితే సినిమాహాలు వుంది అందుకే అక్కడి వుద్యోగస్తులందరూ కల్సి ఒక రిక్రియేషన్ క్లబ్ ఏర్పాటు చేసుకొన్నారు సాయంత్రం అయిదు నుంచి ఏడూ, ఎనిమిది గంటల వరకూ అక్కడ కాలక్షేపం చేసి యిళ్ళు చేరుకొంటారు

మరి మహిళల సంగతి ? భోజనాలుపెట్టి పది గంటలకల్లా భర్తలను ఆఫీసులకి సాగనంపుతారు పిల్లలను స్కూళ్ళకు పంపుతారు అన్నీ సర్దుకొనే సరికి పదకొండు గంటలు దాటుతుంది ఆ తర్వాత ఖాళీ కొంతమంది పుస్తకాలతోనూ, రేడియోతోనూ కాలక్షేపం చేస్తారు కొంతమంది మహిళలు మధ్యాహ్నంపూట ఒకరింట సమావేశం అవుతారు పిచ్చాపాటి కబుర్లు దొర్లుతాయ్ అలా సమావేశం అయే యిళ్లే సీతామహాలక్ష్మి యిల్లు వారి కబుర్లు పనిమనిషి పాపమ్మ నుంచి మొదలుపెట్టి గెజిటెడ్ ఆఫీసర్ల ట్రాన్సఫర్ల దగ్గర గెంతువేసి, ఫారెస్టాఫీసర్ లంచగొండితనం వరకూ పరుగెత్తి ప్రధానమంత్రి విదేశ పర్యటనవరకు ఎగురుతాయ్

ఇంకా — పెళ్ళయి పదేళ్ళయినా కడుపు పండని సద్దు బ్రహ్మచారి ఫారెస్టరు పాపారావు యింట్లో పనికి కుదిరిన నెల రోజులకే నెల తప్పిందనీ — సరస్వతి మొగుడు మలేరియా యినస్పెక్టర్ చెంద్రరావ్ రోజూ రాత్రి బాగా తాగొచ్చి పెళ్ళాన్ని చితకబాదుతాడనీ — ఇద్దరు పెళ్ళాల మొగుడు హాస్టలు వార్డెన్ హైస్కూలుకి కొత్తగా వచ్చిన హిందీ పంతులమ్మతో సరసాలు మొదలుపెట్టాడనీ— భర్త వేసక్టమీ ఆపరేషన్ చేయించుకొన్నా వనజమ్మ మళ్ళీ నెలతప్పిందనీ, సంక్రాంతి శలవులకి విశాఖపట్నం వెళ్తున్నానని అందరితో చెప్పినా కడుపు తీయించు కొందుకే వెళ్తోందనీ — హెడ్మాష్టరుగారి అల్లుడు పండక్కి రాకపోవడం హైదరాబాద్ ట్రైనింగ్‌కి వెళ్లడం కాదనీ, అతను కోరిన టూ—ఇన్ వన్ కొనకపోవడమే కారణమనీ — ఫారెస్టు రేంజరుగారి భార్య పార్వతీబాయి కంచిలో కొన్న పట్టుచీర మంచి రకం కాదనీ, ఆరు వందలు పెట్టి కొన్నామనీ అంటున్నా మూడొందలు దాటదనీ — జానకమ్మ చేయించుకొన్న పుస్తెలతాడు తులంబావే అయినా రెండు తులాలని చెప్పుకొంటోందనీ

ఇత్యాది ఆశక్తికరమైన విషయాలు ఆయా పడతుల పరోక్షంలో చెప్పి చాకచక్యంగా అక్కడకు చేరిన అతివలను ఆకట్టుకొంటుంది సీతామహాలక్ష్మి అంతే కాదు —

ఎవరి మొగుడు ప్రావిడెంటు ఫండునుంచి ఎంతెంత ఎడ్వాన్సు తీసుకొన్నదీ, ఎలా ఖర్చు చేసిందీ, ఫారెస్టు కంట్రాక్టర్ ఆఫీసరుకు ఎంత మామూలు చెల్లించిందీ, డాక్టరుగార్కీ, డెప్యూటీ డైరక్టర్ గార్కీ మధ్య వున్న అభిప్రాయ బేధాలు ఎంతవరకు వెళ్ళిందీ, తన దారికి అడ్డు వస్తున్నాడని యూడీసీ అప్పారావుని తాసిల్దారే ట్రాన్సఫర్ చేయించాడనీ, సెండాఫ్ పార్టీలో అతన్ని పొగుడ్తూ అన్న మాటలు అన్నీ నటనకే అనీ — ఫారెస్టు రేంజరు శలవులో వుండటం కాదు సస్పెన్షన్‌లో వున్నాడనీ

ఇత్యాది ఆఫీసు విషయాలూ ఆమె కెన్నో తెల్సు ! ఆ విషయాలు ఆమెకెలా తెల్సాయో తెలియని తరుణులు ఆనందాశ్చర్యాల్లో మునిగితేల్తూ వుంటారు వింటారు ! వినోదిస్తారు !!

ఒక్కోప్పుడు చిన్న చిన్న తగవులూ తంటాలూ వస్తువుంటాయి అయినా చాకచక్యంగా తప్పి కొంటుంది, యితరులను తప్పిస్తుంది అది ఆ సీతా మహాలక్ష్మిలోవున్న మహిమే అనండి ప్రత్యేకతే అనండి

* * *

సీతామహాలక్ష్మి మొగుడు ఒక ఆఫీసులో యూడీ ఎకౌంటెంట్ ! పేరు సీతాపతిరావు ! "సీతాపతి" అని పిల్చినా పలుకుతాడు అతిసామ్యుడు ఏ చెడు అలవాట్లులేని మనిషి ! కనీసం చెక్క ముక్కయినా వేసుకోడు ఆఫీసు అయాక్క అయిదు గంటలకి రిక్రియేషన్ క్లబ్‌కిపోతాడు ! పేపరు చూస్తాడు పార్ట్నర్ వుంటే కొంతసేపు చదరంగం ఆడ్తాడు అందరికన్నా ముందు ఆరున్నర అయే సరికి యిల్లు చేరుకొంటాడు సీతాపతిరావు పనిచేసే ఆఫీసులోనే ఆఫీసు సూపర్నెంటు శశిభూషణరావు అంటే శశికళగారి భర్త ఆ క్లబ్‌కి శక్రటరీ ! శక్రటరీ కాబట్టి అతను యిల్లు చేరేసరికి ఎనిమిది గంటలు దాటుతుంది అందరితోనూ కల్సికట్టుగా సరదాగా ఉంటాడు శశిభూషణరావు ఆయనకు నలుగురు సంతానం పెద్దబ్బాయి బి టెక్, రెండో అబ్బాయి మెడిసిన్ సెకండియర్, మూడోవాడు ఇంటర్ ఫస్టియర్ వాల్తేరులో చదువుతున్నారు ఆఖరున అమ్మాయి హైస్కూల్లో పదోక్లాసు చదువుతోంది భర్తపోయిన చెల్లెల్ను విశాఖపట్నంలో పిల్లల దగ్గర వుంచి చదువు చెప్పిస్తున్నారు మేనల్లుడ్నిగూడా ఇంటర్ చదివిస్తున్నారు జీతం తప్పించి వేరే ఆస్తిపాస్తులులేవు అన్యాయపు ఆర్జనకు ఆమడ దూరంలో వుంటారు అందుకే ఆయనంటే అందరికీ గౌరవం

ఆ రోజు రాత్రి భర్తను అడిగింది శశికళ "ఏమండీ క్రిందటి నెల్లో రెండువేలు ప్రావిడెంట్ ఫండ్ లోన్ తీసుకున్నార్ట !" అని నాతో చెప్పారు కాదేం ? అన్న ప్రశ్న ధ్వనించింది ఆ కంఠంలో

ముప్ఫయ్ సంవత్సరాల క్రితం కాపరానికి వచ్చినా ఏనాడూ అటువంటి విషయాలు అడగని భార్య ఆ క్షణం అలా అడిగినందుకు ఆశ్చర్యపోయాడు

"తీసుకొన్నారా ?" మరలా అడిగింది శశికళ

"నీ కెవరు చెప్పారు ?" అడిగాడు ఆశ్చర్యా న్నుంచి తేరుకొని శశిభూషణరావు

"ఎవరు చెప్పిందీ తర్వాత చెబుతా కానీ తీసుకొన్నారా లేదా ?" నిగ్గదీసి అడిగింది మరోసారి

ఆవాటి భార్య ధోరణికి విస్మయం చెందాడు శశిభూషణరావు

"మన పిల్లలకి ఆస్తిపాస్తుల్ని ఎలాగూ సమకూర్చిపెట్టలేం! బాగా చదివించండి! పెద్ద వుద్యోగాలొస్తాయ్! తండ్రిలా గుమాస్తాల్లా ఆఫీసులకి అంకితం కాకూడదు! వారి భవిష్యత్తు బాగుపడే మార్గంలో వాళ్లని పెట్టండి! ఎంత ఖర్చయినా ఫర్వాలేదు అంటే అప్పులు చేయమని కాదు! మనం తాత్కాలికంగా యిబ్బందులు పడినా ఫర్వాలేదు! నాకు నగలమీద మోజులేదు! వున్న నగలు యిమ్మన్నా యిస్తా! వాళ్ళ ప్రయోజకులు కావాలి! మీ సంపాదనెంత? ఎంత మిగులుస్తున్నారు అని నే నెప్పుడూ అడగను! మిగిల్చినా పది పదిహేను వేలు ప్రావిడెంటు ఫండు మిగల్చగలరు! అంతా అయిపోయాక ఆ పదిహేనువేలూ మన పిల్లల్ని ప్రయోజకుల్ని చేయలేవు!" అంటూ వుండే శశికళేనా యీనాడిలా ప్రశ్నిస్తోంది?

గత సంవత్సరం పిల్లల్ని యూనివర్సిటీలోనూ, కాలేజీల్లోనూ చేర్పించడానికి డబ్బు లేకపోతే భార్యతో సంప్రదించాడు ఇన్సూరెన్సు పాలసీనుంచి రెండు వేలు అప్పుతెస్తానన్నాడు

"ఇన్సూరెన్సు పాలసీనుంచి తెచ్చినా ప్రావిడెంటు ఫండునుంచి తెచ్చినా నాతో చెప్పనవసరం లేదండీ! మీ మీద నాకు నమ్మకం వుంది డబ్బుని దుర్వినియోగం చేయరని! పిల్లలు ప్రయోజకులు కావడవే మన ధ్యేయం! వాళ్లే మన ఆస్తి! ఆడపిల్ల పెళ్లీడు కొచ్చేసరికి పెద్దవాళ్లిద్దరూ అందొస్తారు! ఆపైన మీ రిటైర్మెంటు డబ్బు వస్తుంది! అనవసరంగా డబ్బు ఖర్చుచేస్తారని నే నెప్పుడూ అనుకోను! నన్నడగక్కర్లేదు! మీకెలా తోస్తే అలాచేయండి! ఇలాంటి విషయాల్లో నన్ను సంప్రదించనవసరం లేదు! జమా ఖర్చులు నే నెప్పుడూ అడగను" అన్న శశికళేనా యిలా నిలదీసి అడుగుతోంది? ఆశ్చర్యంగా భార్యనూ చూస్తూ వుండిపోయాడు

"చెప్పండి! లోను తీసుకొన్నారా?" మరలా అడిగింది వుద్రేకపడుతూ

"అవును! తీసుకొన్నా!" అన్నాడు

"ముందుగా నాతో చెబితే ఏం పోయిందండి!" ఆవేశాన్ని అణుచుకొంటూ నెమ్మదిగా అడిగింది

"పిల్లల ఫీజులకీ, హాస్టలు బిల్లులకీ, పుస్తకాలకీ తీసుకొన్నా!" అన్నాడు నెమ్మదిగా తప్పు చేసినవానిలా

"ఎందుకు తెచ్చారు? ఏం చేసారు? అని అడగడంలేదండి! తెచ్చినట్టు నాతో చెబితే ఎంత బావున్ను!"

భార్య పదే పదే అదే మాటంటూ వుంటే చీకాకు వేసిందతనికి

"మనపిల్లలు నాలాగే గుమాస్తాలు కాకూడదని అన్నావా లేదా?" అడిగారు వుద్రేక పడకుండా

"అవును"

"నగలూ చీరలూ వద్దు, తెలివైనవాళ్ళు కాబట్టి పిల్లలకి పెద్ద చదువులు చెప్పించమని అనేదానివి కదా?"

"అవునండీ! ఇప్పటికీ నా ధ్యేయం అదేనండి! మన పిల్లలు ప్రయోజకులు కావాలండి!"

"నా జీతం ఎంతో నీకు తెల్సు! పిల్లలకి యింజనీరింగూ, మెడిసనూ చెప్పించాలంటే ఎంత ఖర్చు? ప్రావిడెంటుఫండులోనో మరెలాగో అప్పు చేసి కిందా మీదా పెట్టి సర్దుకొంటున్నాను పిల్లల భవిష్యత్తు కోసం డబ్బు ఖర్చు చేస్తే ఆఖరి దశలో అవస్థలు పడతామని భయపడుతున్నావా? లేక డబ్బుని ఎవరికైనా యిస్తున్నాననిగానీ, దుర్వ్యసనాలకి ఖర్చు చేస్తున్నాననిగాని అనుమానపడుతున్నావా? చెప్పు శశీ! చెప్పు!"

ఆవేశపడ్డాడు శశిభూషణరావు

భర్త మాటలకి విలవిల్లాడింది శశికళ నయనాలు అశ్రుపూరితాలయాయ్ గద్గదస్వరంలో అంది —

"మీరు డబ్బుని పాడుచేస్తున్నారని కాదండీ నా ఆవేదన! భార్యకు చెప్పకుండా వేలకు వేలు ఖర్చుచేసే మనిషని వారంతా అనుకొంటూవుంటే విని భరించలేకపోయా"

అర్ధాంగి ఆవేదనను అర్థంచేసుకున్నాడు శశిభూషణరావు తన వుద్రేకానికి వుచ్చు బిగించాడు

"సరే! ఇకముందు చెబుతాలే!" అన్నాడు ఆమెను ఊరడించాలని

"జమా ఖర్చులు చెప్పమని మిమ్మల్ని ఆదేశించడంలేదండి! ఇంత తెచ్చాను యిలా చేస్తున్నాను అని అంటే చాలు! నా అనుమతి తీసుకోనవసరం లేదండి! ఈ విషయం నాకు ముందుగా తెల్సి వుంటే" అని ఆగింది గుక్క తిప్పుకొందుకు

"తెల్సివుంటే?" రెట్టించాడతను

"అవునండి! మా పిల్లలు పెద్ద చదువులు చదువుతున్నారు! డబ్బు చాలా అవసరం! పైచోట అప్పుచేసి వడ్డీల వుచ్చులో చిక్కుకోవడం ఇష్టంలేక యిలా చేస్తున్నారు! నా పిల్లలు ఒకరు యింజనీరూ ఒకరు డాక్టరు కాబోతున్నారు అని సగర్వంగా వాళ్లతో చెప్పి వాళ్లనోళ్ల మూయించేదాన్ని! వాళ్లు కుళ్లి కుళ్లి యేడ్చేవాళ్లు"

ఆనందాశ్రువులొస్తూ తన వైపు చూస్తుంటే కన్నీటిని తుడిచాడు

కార్టూనిస్టులకు సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి

★ ప్రతి కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వింపేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలా బిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరుమీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతవేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

– సం॥

ఓ సీతాపతి కథ

"సీతామహాలక్ష్మిగారింటి కెళ్లావా ?" లాలనగా అడిగాడు

"డాక్టరుగారబ్బాయి పుట్టినరోజు పేరంటానికి వెళ్లా దారిలో తన యింటికి రమ్మని సీతామహాలక్ష్మి బలవంతం చేస్తే వెళ్లా అప్పుడు అక్కడ అమ్మలక్కలమధ్య ఈ ప్రస్తావన వచ్చింది"

"నువ్వేం అన్నావ్ ?" అడిగాడు కుతూహలంగా

"డబ్బు విషయంలో మా వారిని నేనేమీ అడగనండి! వారు చెప్పబోయినా ఆ విషయాల్లో నాకు నిమిత్తం లేనట్లుగా వుంటాను పిల్లల చదువులకి బోలెడు డబ్బు కావాలి! మాకేం ఆస్తిపాస్తుల్లేవు! ఏదోవిధంగా సర్దుకోవాలి గదా! అన్నా!"

భార్య సమయస్ఫూర్తిని అభినందించాడు శశిభూషణరావు

"బాగా చెప్పావ్! ఇంకెప్పుడూ మన విషయాలు ఎత్తరు!"

"నా దగ్గర అనరండి! ఎవరిమీదనో ఒకరిమీద చెప్పుకొని ఆ పూటకి ఆనందించడం వారి కలవాటైపోయింది! అది నాకు నచ్చదు అందుకే ఎంతో అవసరం అయితేగానీ ఎక్కడకీ వెళ్లను! అస్తమాటూ అక్కడకు వెళ్లనని వాళ్లకి అక్కసు!"

ఆ క్షణంలో సీతాపతిరావుమీద చెప్పరాని కోపం వచ్చిందతనికి వెంటనే యింటికి వెళ్లి అడగాలని పించింది కోపాన్ని అతికష్టంమీద అణచుకొన్నాడు మర్నాడు ఆఫీసులో అందరి ముందూ అడిగి అవమానపర్చాలనుకొన్నాడు

* * *

మర్నాడాఫీసులో అడుగుపెట్టిన దగ్గరనుంచీ సీతాపతిరావుని గట్టిగా దులిపేయడం కోసం సమయం కోసం వేచియున్నాడు ఆఫీసు సూపర్నెంటు శశిభూషణరావు నలుగురిలోనూ అడిగితే చిన్న బుచ్చుకొంటాడని ఏకాంతంలో అడగడానికి నిశ్చయించుకొన్నాడు సాయంత్రం అయిదుగంటలయింది ఒక్కొక్క గుమాస్తా తనతో చెప్పి బయటకు వెళ్తున్నారు ఆఖరున సీతాపతిరావుకూడా వచ్చాడు "వస్తాన్సార్!" అంటూ కదలబోయాడు మామూలుగా

"మీరుండండి సీతాపతిరావుగారూ! మీతో కొంచెం పనుంది!" అనడంతో ఎదురుగా కుర్చీలో కూలబడ్డాడు సీతాపతిరావు న్యూస్‌పేపర్ చూస్తూ కూర్చున్నాడు ఆఫీసు తలుపులన్నీవేసి ఎదురుగా నిలబడ్డాడు చౌకీదారు అప్పలస్వామి వాళిద్దరూ కూడా వెళ్తే ఆఫీసు తలుపులు తాళాలువేసి తనూ పోవచ్చునని వాడి ఉద్దేశం అప్పలస్వామి ఎదురుగా ఎందుకు నిలబడ్డాడో గ్రహించాడు శశిభూషణరావు వాడిని కొంతసేపు బయటకు పంపాలి

"గడ్డపారలు బ్రహ్మానికిచ్చి వారంరోజులైంది తయారుచేసాడేమో కనుక్కోనిరా!" పని పురమాయించి, బయటకు పంపాడు ఇక ఆఫీసులో యిద్దరే మిగిలారు

"చెప్పండి సార్! ఏమైన పనుందా ?" లేచి నిలబడి అడిగాడు సీతాపతిరావు

శశిభూషణంరావు మొహం జేవురించింది

"చూడండి సీతాపతిరావుగారూ! ఎన్నాళ్లనుంచో మీకో విషయం చెప్పాలనుకొంటున్నా! కానీ సమయమూ సందర్భమూ కల్సిరాలేదు!" అని ఆగాడు

"చెప్పండి సార్!" అన్నాడు సీతాపతిరావు వినయంగా

"మన ఆఫీసరుగార్కి అసిస్టెంటుగా మనం ఆఫీసులో వ్యవహారిస్తూ వుంటున్నాం! ఆఫీసు పని నిర్వహణలో మనకెన్నో విషయాలు తెలుస్తూ వుంటాయ్! ఎవరికి మెమో ఆఫ్ చార్జెస్ యివ్వబడబోతోందో, ఎవరిమీద ఎంక్వయరీ ఆర్డరు పడిందో, ఎవరికి ట్రాన్స్ఫర్ కాబోతోందో, ఎవరికి లోను సాంక్షను అయిందో, లేక రిజక్టు అయిందో, ఏ కాంట్రాక్టర్ ఎస్టిమేట్ ఎప్రూవ్ కాబడుతోందో, మొదలైన ఇంకా ఎన్నో విషయాలు తెలుస్తాయ్, వాటిని ముందుగానే బయటపెట్టకూడదు వాటంతట అవే బయటపడ్తాయ్ బయటపడ్డాకయినా కొన్నింటిమీద మనం కామెంట్ చేయకూడదు ఏమంటారు ?" అని ఆగాడు శశిభూషణరావు

అతని వుపోద్ఘాతం దేనిగురించో అర్థం చేసుకొన్నాడు సీతాపతిరావు

"ఎస్సార్!" అన్నాడు మొహం దించుకొని

"మరి మీరు చేసిన పనేవిటి ? నేను అడ్వాన్సు తీసుకొన్నానని కాలనీ అంతా ఎలా తెల్సింది ? మీకూ నాకూ ఆఫసరుగార్కి తప్ప యితరులకు తెలియడానికి ఆస్కారం లేదు"

సీతాపతిరావు తలెత్తలేకపోయాడు

"అయాం ఎక్స్ట్రీమ్లీ సారీ సర్! మీవాళ్ల పట్టుచీర కొనుక్కోవాలని చాలా రోజులునుంచీ అనుకొంటున్నార్ట! బహుశ ఈ అడ్వాన్సులో కొనుక్కొంటారేమోనని మాటవరసకి మావాళ్లతో అన్నాను!" నీళ్లు నమిలాడు

శశిభూషణరావు కోపం తారాస్థాయికి అందుకొంది

"ఇలాంటి విషయాలు ఆడవాళ్లతో చెబితే ఎన్నో అనర్థాలకి దారితీస్తాయ్! కాపురాలు కూలొచ్చు! తొందరపాటులో కొందరు ప్రాణాలు తీసుకోవచ్చు! మీ అలవాటు మంచిది కాదండి! నా విషయం తెల్సినందువల్ల నాకేం కష్టంగానీ నష్టంగానీ వాటిల్లలేదు! ఇది మంచి పద్ధతికాదు! దీనికి స్వస్తి చెప్పాలి! అయాం సారీ!"

అంతలో చౌకీదారు రావడంతో వారిమధ్య సంభాషణ ఆగిపోయింది ఆ క్షణంలో అప్పలస్వామి సీతాపతిరావుకి ఆపద్బాంధవునిలా కన్పించాడు

"ఇక మీరు వెళ్లండి!" అనడంతో మరు క్షణంలో ఆఫీసునుంచి బయట పడ్డాడు సీతాపతిరావు ఆ రోజు క్లబ్‌కి పోలేదు తిన్నగా యింటికిపోయాడు

* * *

మర్నాడు తెల్లవారే సరికి సీతామహాలక్ష్మి భరించలేని శిరోవేదనతో బాధపడ్తోందన్న వార్త ఆ కాలనీ అంతా ప్రాకిపోయింది

ఎన్నిమందులు మింగినా, ఎన్ని అమృతాంజనం సీసాలు మర్దనా చేసినా, ఎంత పసరు తాగినా తగ్గలేదు అన్నిప్రయత్నాలు వృధా అయ్యాయ్ తరుణీ మణులెల్లరూ తల్లడిల్లిపోయారు ●